క్లుప్తంగా

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం టౌన్ కమిటీ అధ్యక్షుడు అక్రమ్

వేములవాడ: మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసం సందర్భంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని అన్ని మసీదుల వద్ద ఏర్పాట్లు చేయాలని ముస్లిం టౌన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అక్రమ్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని అన్ని మసీదుల వద్ద హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని, నీటి సరఫరా, ఈద్గాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టి అన్ని ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. జామే మసీద్ అధ్యక్షుడు నవాబ్‌ఖాన్, మజీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఇమామ్, సర్వర్ పాషా, మహమ్మద్ బషీర్, ముస్లిం కమిటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రజాక్, సయ్యద్ ఉమర్, కోశాధికారి ముషాహిద్, మొహమ్మద్ సత్తార్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్య లేకుండా చూడాలి

బోయినపల్లి: రానున్న వేసవిలో తాగు, సాగు నీటి సమస్య తలెత్తకుండా విలాసాగర్ చెరువును వరదకాలువ నుంచి లిఫ్ట్‌ద్వారా నింపాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను రైతులు కోరారు. శనివారం రైతులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే రెండు రోజుల్లో చెరువులోకి నీటిని విడుదల చేస్తానని హామీఇచ్చారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి చిత్రపటంతో గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపు తీశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పండితులు హోమం నిర్వహించారు. నవగ్రహ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పెద్దసంఖ్యలో హాజరై మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు గోపాల్‌చారి, నవీన్‌చారి, ఆలయ కమిటీ చైర్మన్ లద్దునూరి హన్మండ్లు, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ నునగోండ మల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు నిమ్మ సుధాకర్‌రెడ్డి, పర్శరాములు, నిమ్మ నారాయణరెడ్డి, బొమ్మిడి రాజలింగం, సూర నర్సయ్య, మోతే లక్ష్మారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కే దేవరాజం మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కళాశాల సిబ్బంది నయీమ్, సతీశ్‌రెడ్డి, లక్ష్మయ్య, దేవరాజు, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ మండల ఆర్ఐగా బాలు బాధ్యతలు స్వీకరించారు. రుద్రంగి మండలంలో కొంతకాలం పనిచేసిన ఆయన ఆర్ఐ ప్రమోషన్‌పై వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆర్ఐ రవి ప్రమోషన్‌పై సిద్దిపేటకు బదిలీపై వెళ్లారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శని వారం బాలికలకు చిత్రలేఖనం, ఉపన్యాసం, వ్యాసరచన, పలు క్రీడాపోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీలో ప్రతిభ కనబర్చిన శ్రీ విద్యను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్లు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు మ హమ్మద్ గౌస్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు

నియామకం

కోనరావుపేట: మండలంలోని మల్కపేటకు చెందిన పాకాల శ్రీకాంత్ గౌడ్‌ను బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్యూట్..షూట్

- బ్యూటీఫుల్‌గా స్వీట్ మెమొరీస్
- సిరిసిల్లలో ఇండోర్ స్టూడియోస్
- మధుర జ్ఞాపకాలుగా స్పెషల్ డేస్
- ఆకట్టుకుంటున్న స్పెషల్ ఫొటో ఆల్బమ్స్..

సిరిసిల్లటౌన్: రోజులు మారాయి. పిల్లలపై తల్లిదండ్రుల అభిరుచులు, ఆలోచనలు మారాయి. ఒకప్పుడు పెద్ద కుటుంబాల్లో



పిల్లలను పెంచామా పెద్ద చేశామా.. జీవితంలో స్థిరపడేలా చేశామా అనే ఆలోచన ధోరణి తల్లిదండ్రుల్లో ఉండేది. ఇప్పుడు అలాకాకుండా చిన్న కుటుంబాలైనా చింతలేకుండా పిల్లలకు మంచి భవిష్యత్తుతో పాటు తమ క్యూటీ బేబీస్ అందమైన బోసినవ్వులు, స్పెషల్ గెటప్స్‌లో ఫొటోలు తీసి భద్రపరుస్తున్నారు. వారు పెద్దయ్యాక చిన్నప్పటి వారి స్వీట్ మెమోరీస్‌ను గిఫ్ట్‌గా ఇస్తున్నారు. దీనిపై సండే స్పెషల్ కథనం...

బర్త్ డే, స్పెషల్ డేస్‌లో..

ఇప్పటి తల్లిదండ్రులు తమ జీవితాల్లో మధుర జ్ఞాపకాలను భద్రపరుచుకునేందుకు ఇష్టపడుతున్నారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్లవరకు చిన్నారులను నెలలు, బర్త్ డే, ఇతర స్పెషల్ డేస్‌కు ఫొటో షూట్స్ చేయిస్తున్నారు. ఇందుకు సిరిసిల్లలో ఇండోర్ స్టూడియోస్ వెలిశాయి. ప్రధాన నగరాల్లో మాదిరిగానే ఇక్కడ భారీ సెట్టింగ్స్‌తో స్టూడియోస్‌ను ఏర్పాటు చేయగా..కస్టమర్లు అధిక సంఖ్యలో వస్తున్నారు. భారీ సెట్టింగ్స్‌తో సినిమా లొకేషన్స్ మాదిరిగా ఇండోర్ షూటింగ్స్‌కు సిరిసిల్ల అడ్డాగా మారింది. జిల్లా నలుమూలలు సిద్దిపేట, జగిత్యాల, నిజామాబాద్, వరంగల్, మెట్‌పల్లి, కోరుట్ల, కామారెడ్డి, దుబ్బాక, కరీంనగర్ తదితర ప్రాంతాల ప్రజలు రావడంతో ఇక్కడి ఫొటోగ్రాఫర్స్‌కు ఉపాధి పెరిగింది.

త్రీడీ సెట్టింగ్స్..

సిరిసిల్లలోని ఇండోర్ ఫొటో స్టూడియోస్‌లో నిర్వాహకులు త్రీడీ కళా రూపాలతో చూడగానే అదుర్స్ అనేలా సెట్టింగ్స్‌ను ఏర్పాటు చేశారు. కిడ్స్ షూట్స్ కోసం పట్టణంలో ఉన్న ఫొటో స్టూడియోలకు వస్తున్నారు. ఇండోర్ స్టూడియోలో సినిమాలను తలపించేలా సెట్టింగ్స్‌తో చిన్నారులను క్యూట్‌గా ఫొటోలు తీస్తున్నారు. పలు లొకేషన్స్, సీనరీస్‌ను పోలిన సెట్టింగ్స్‌లో ముద్దులొలికే చిన్నారులను అందంగా ఫొటోలు తీస్తున్నారు. ఇండోర్ స్టూడియోస్‌లో మూడు గంటలకు రూ.7వేలు, 6గంటలకు రూ.10వేలు చార్జీలు వేస్తున్నారు. ఫొటోగ్రాఫర్స్‌ను పర్సనల్‌గా తీసుకెళ్లొచ్చు. స్టూడియో వారితోనే షూటింగ్ చేయించుకుంటే అదనంగా రూ.4వేలు చెల్లిస్తే..తీసిన ఫొటోస్‌ను డెవలప్ చేసి సాఫ్ట్‌కాపీని అందిస్తారు. ఇక క్యానెవర 15 అల్బమ్ షీట్స్‌ను అదనపు చార్జీలతో అందిస్తారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఏసీ రూమ్స్, ఫీడింగ్ రూమ్స్ ఉండటంతో దూరప్రాంతాల వచ్చి ఎంచక్కా ఫొటో షూట్స్ చేయించుకుంటున్నారు.

నాలుగేళ్లుగా కిడ్స్ స్టూడియో



నాలుగేళ్లుగా సిరిసిల్లలో ఇండోర్ స్టూడియో నిర్వహిస్తున్నాం. ఇతర నగరాల కంటే తక్కువ ఖర్చులోనే అందమైన ఆల్బమ్స్ రూపొందిస్తున్నాం. ఇతర జిల్లాలనుంచి కూడా కస్టమర్లు వస్తున్నారు. దాదాపు 300లకు పైగా ఆల్బమ్స్ తయారు చేశాం. త్రీడీ థీమ్స్ ప్రత్యేకత. కస్టమర్ల కోరుకున్న రీతుల్లో ఫొటో చిత్రీకరణ ఉంటుంది.

– గుజ్జె నవీన్, సీనియర్ ఫొటోగ్రాఫర్

బాబుతో స్వీట్ మెమొరీ



మాబాబు మొదటి బర్త్‌డే స్వీట్ మెమోరీగా పదిలపర్చుకున్నాం. పట్టణంలోని ఇండోర్ స్టూడియోలో ఫొటో షూట్స్ చేయించాం. మంచి ఫొటోలు వచ్చాయి. ఇతర నగరాలకు వెళ్లకుండానే ఔట్ డోర్ షూట్స్ చేసే మంచి ఫొటోగ్రాఫర్స్ ఉన్నారు. రీజనేబుల్ రేట్స్‌లో ఫొటో షూట్, ఆల్బమ్స్ ఇచ్చారు.

– మధు, గోపాల్‌రావుపల్లి

ఫొటోగ్రఫీ బాగుంది



ఇండోర్‌లో మాపాప ఫొటోషూట్ బాగుంది. పట్టణంలోని ఇండోర్ స్టూడియోలో కోరుకున్న లొకేషన్స్‌ను ఆర్టిఫిషియల్ సెట్టింగ్స్‌లో ఫొటోలు తీస్తున్నారు. ఇతర నగరాల్లో కన్నా ఇక్కడ తక్కువ చార్జీలున్నాయి. మేం కోరుకున్న మోమోరీస్‌ను అందించారు. ఎక్కడికి వెళ్లకుండానే ఇక్కడే త్రీడీ లొకేషన్స్, సీనరీస్‌లలో ఫొటో షూట్ చేస్తున్నారు.

– కరుణాకర్, చంద్రంపేట

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వనజా కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, వేములవాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్ కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల లెక్చరర్స్ మురళీ, సునీత, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, నవీన్‌రెడ్డి, అఫ్రోజ్ సుల్తానా, సునీత, గంగరాజు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కందేపికి చాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సిరిసిల్లకల్చరల్: ప్రముఖ హస్తకళాకారిణి, బాల సాహిత్యవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్‌కు చాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. సృజన్ పిల్లల ఆస్పత్రి నిర్వాహకురాలిగా కొనసాగుతున్న ఆమె ఆస్పత్రి ప్రిస్క్రిప్షన్‌పై వివిధ సామాజిక రుగ్మతలు, ఆరోగ్య సంబంధ సమస్యలపై అవగాహన పెంచే మినీ గేయాల రూపంలో ప్రచురిస్తున్నారు. ఈసందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి: ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలుపునకు కృషిచేయాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శుభం గార్డెన్స్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్లు, కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ చిలకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రి ప్రభలత మనోహర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలపతి, ఉపాధ్యక్షుడు మనోహర్ మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపునకు పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని వైశ్యభవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యంగా ఓటు వేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ వుట్కూరి వెంకటరమణ రెడ్డి, నాయకులు వెంకటి, ప్రసాద్, చిట్టి ఆనంద రెడ్డి, బాల పోచయ్య, తదితరులు పాల్గొన్నారు

వేములవాడరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్‌గౌడ్ అన్నారు. రూరల్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనను రూరల్ అధ్యక్షుడు సత్కరించి, రాజన్న చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడగాని వెంకటేశ్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

సమయపాలన పాటించని టీచర్లపై చర్యలు

ముస్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించని టీచర్లపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి హెచ్చరించారు. ముస్తాబాద్, గూడెం సెక్టర్లలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని కొందరు టీచర్లు సమయానికి కేంద్రాలకు రావడం లేదన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఆయాపోస్టుల భర్తీలో ఎలాంటి ప్రచారం నమ్మవద్దన్నారు. కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించి ఆదర్శంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ అంజలి, టీచర్లు పాల్గొన్నారు.

రూ.20కే రూ.2 లక్షల ప్రమాద బీమా

తంగళ్లపల్లి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కేవలం రూ.20కే రూ.2 లక్షల ప్రమాద బీమా పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్ మాస్టర్ ఆర్.కనకయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) పథకంలో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు వయస్సు గలవారు పొందవచ్చని అందుకోసం పోస్టాఫీసులో ఖాతా తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు పోస్టాఫీసులో సంప్రదించాలని కోరారు.

కేసు నమోదు

ముస్తాబాద్: వివాహిత ఆత్మహత్యకు కారణమైన ఐదుగురితోపాటు ఫైనాన్స్ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ శనివారం తెలిపారు. ఆవునూర్‌కు చెందిన గట్ల సునీత (45) అప్పుల బాధతో ఉరేసుకోగా ఆవునూర్‌కు చెందిన ఐదుగురితోపాటు ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీపై కేసు నమోదు చేశామన్నారు. అప్పులిచ్చి వేధించడంతో మనస్తాపానికి గురైన సునీత ఆత్మహత్య చేసుకుందన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

సిరిసిల్లటౌన్: పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ (అఖిల భారత విద్యార్థి సమాఖ్య) జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేశ్ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. గురుకులాలలో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని, పెంచిన మెస్ కాస్మోటిక్ చార్జీలను అనుగుణంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంద అనిల్, ఉపాధ్యక్షుడు పెండాల ఆదిత్య, మల్యాల శ్రీజ, పెంట భారత్, సహాయ కార్యదర్శులు పుట్టి సాత్విక్, దొంతి అరుణ్ మరియు ఈశ్వర్, నిశాత్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● పోస్టర్లు ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: వచ్చేనెల 10, 11, 12 తేదీల్లో వేములవాడలోని మంజునాథ ఫంక్షన్‌హాల్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. శనివారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో పోస్టర్లను ఆవిష్కరించారు. డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ మార్వాడి సుదర్శన్, ఏఐటీసీ నాయకులు మీసం లక్ష్మణ్, ఏఐ ఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులు ఆందోళన చెందొద్దు

వేములవాడఅర్బన్: విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళన చెందవద్దని లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో అవగాహన కల్పించారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే సత్యంకు ఆహ్వానం

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వరస్వామి మహా శివరాత్రి జాతరకు హాజరుకావాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గ్రామస్తులు ఆహ్వానించారు. నాయకులు ఏనుగుల ప్రశాంత్‌కుమార్, జూలపల్లి సంపత్‌రావు, కురుమ సంఘం నాయకులు కొంరయ్య,రైతులు ఉన్నారు.

● విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో దుర్గాంబిక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పల్లిమక్తలో దుర్గాంబిక నూతన ఆలయాన్ని నిర్మించి ఈనెల 21 నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు జరుపుతున్నారు. శనివారం ప్రతిష్ఠాంగ హోమం, స్థాపిత దేవతార్చన పూజలు, జలాధివాసం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

● ఎండీ సలీంకు డాక్టరేట్

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో తొలితరం ప్రచార కర్త ఎండీ సలీంకు డాక్టరేట్ వరించింది. శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యునివర్సిటీ సలీంకు గౌరవ డాక్టరేట్ పట్టాను అందించింది. ఆయనను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

● స్వాగత తోరణాన్ని ఢీకొట్టిన లారీ

వేములవాడ: రాజన్న జాతర సందర్భంగా మూలవాగు బ్రిడ్జిపై లైటింగ్‌తో కూడిన వెల్‌కమ్ తోరణాలను శనివారం రాత్రి ఓ లారీ ఢీకొట్టింది. దీంతో కొద్దిగా వంగిపోయాయి. మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని మూలవాగు వంతెనపై విద్యుత్‌కాంతులతో మెరుస్తున్న స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. ఇది రద్దీ రోడ్డు కావడంతో వేగంగా వచ్చిన లారీ ఒక తోరణాన్ని ఢీకొట్టింది.

● ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడిపేట: అల్మాస్‌పూర్ శివారులో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. గ్రామ శివారు ఎల్లమ్మ గుడి సమీపంలో హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేపట్టగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని ధరావత్ సుజాత, డ్రైవర్ బండి సాయిలుపై కేసు నమోదు చేశారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ పంట పొలాలకు వెళ్లే మానేరు ప్రాజెక్టు కెనాల్ దారి అస్తవ్యస్తంగా మారింది. 18 డిస్ట్రిబ్యూటరీ నుంచి పొలాలకు వెళ్లే కెనాల్ పక్కనున్న దారి కుంచించుకుపోయింది. దారి మట్టిని తవ్వి నీటిని మళ్లించడంతో దారి ఇరుకుగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే వెళ్లే పరిస్థితి లేదు. పొలాలకు నీరు సక్రమంగా వెళ్లేలా అధికారులు చూడాలని, కెనాల్ దారి భూములను కాపాడాలని చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రవికుమార్, డీఈఈ, సెల్‌నెంబర్ : 9963555560

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

జేఏసీ లక్ష్యం తప్పుదారి పట్టిస్తున్నారు

- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి



అంబేడ్కర్ చౌరస్తాలో చర్చకు కూర్చున్న చక్రపాణి, బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్లటౌన్: పార్టీలకతీతంగా వస్త్రపరిశ్రమ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్న సిరిసిల్ల వస్త్రపరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ లక్ష్యాన్ని కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పేర్కొన్నారు. తనపై వచ్చిన సవాల్‌కు శనివారం ఆ సమయానికి అంబేడ్కర్ విగ్రహం ముందు బైఠాయించారు. గంటసేపు వేచి చూసినా జేఏసీ నేతలు, ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలు రాకపోవడంతో మీడియాతో మాట్లాడారు. తాను రూ.3కోట్లకు పైగా బతుకమ్మ చీరల బిల్లులు తీసుకున్నట్లు వ్యక్తిగత అకౌంట్లను తెప్పించి సదరు నేతలు మీడియా ముఖంగా చెప్పడాన్ని తప్పుబట్టారు. తాను రూ.3కోట్లు తీసుకున్నట్లయితే తనపై నిందారోపణలు చేసినోళ్లు, వారి పక్కనే ఉన్న వారు రూ.30 నుంచి రూ.40కోట్ల వరకు బిల్లులు పొందారన్నారు. దీనిపై తాను చర్చకు సిద్ధమై వచ్చినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో పార్టీలను చూడకుండా ప్రభుత్వ ఆర్డర్లు అందాయని స్పష్టం చేశారు. అర్బన్‌బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వెంగళ శ్రీనివాస్, అడ్డగట్ల మురళి, కోడం శంకర్, అన్నారం శ్రీనివాస్, గడ్డం భాస్కర్ తదితరులున్నారు.

ఘనంగా మడేలేశ్వర బోనాలు



ముస్తాబాద్: మండల కేంద్రంలోని శ్రీమడేలేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శనివారం రాత్రి బోనాలు తీశారు. రజక సామాజిక వర్గం మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి భారీ ర్యాలీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. రజక సంఘం అధ్యక్షుడు మిడిదొడ్డి శేరయ్య, నాయకులు దీటి నర్సింలు, సింగపూర్ సత్తయ్య, బాలయ్య, రామచంద్రం, కృష్ణ, దీటి బాబు, రమేశ్, శంకర్, పర్శరాములు, నారాయణ, రవి, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



వేములవాడ అర్బన్: నాంపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ముస్తాబాద్‌లో ..

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలో కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ సల్మాన్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల కోకన్వీనర్ కనమేని చక్రాధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, శీలప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, షాదుల్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, చెన్ని బాబు, శ్రీపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బోయినపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డికి వేసి గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. విలాసాగర్, తడగొండ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, సంబ లక్ష్మిరాజం, వంశీ, కొంరయ్య, మానాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సద్దుమణిగిన వివాదం

- ముగిసిన అంత్యక్రియలు

కోనరావుపేట: రామన్నపల్లె(బావుసాయిపేట)లో రెండ్రోజులుగా జరుగుతున్న వివాదం సద్దుమణిగింది. పోలీసుల సమక్షంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. రామన్నపల్లెకు చెందిన బత్తుల మల్లయ్య గతనెల 19న ప్రమాదంలో మృతి చెందాడు. అతని మృతికి అదే గ్రామానికి చెందిన అంజయ్యపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నాంపల్లిలో ఉంటున్న మల్లయ్య భార్య రేణ ఈనెల 20న ఆత్మహత్య చేసుకుంది. భార్యాభర్తల మృతికి అంజయ్యనే కారణమని కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. దంతో పోలీసులు రెండ్రోజులుగా రామన్నపల్లెలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా ఆందోళన తర్వాత ఇరువర్గాలు శాంతించాయి. మార్చురీలో ఉన్న రేణ మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి గ్రామానికి తరలించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు మండలంలోని పలుగ్రామాల్లో అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అడవిపదిరకు చెందిన గంగుల మల్లేశం తనకున్న రెండెకరాల పొలంలో అడవిపందుల దాడిలో 20 గుంటల పంట ధ్వంసమైందని తెలిపాడు.